ప్రజాశక్తి
సోమవారం 11 ఆగస్టు 2025
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా





రక్తమోడినా...కేసులుండవ్!



- గంజాయి, మద్యం మత్తులో రెచ్చిపోతున్న గ్యాంగ్‌లు
- స్టేషన్ల వద్ద బాధితులు ఫుల్.. కేసులు నిల్..
- రాజీ పేరుతో 'సెటిల్‌మెంట్లు'
- పోలీసుల ఉదాసీన వైఖరి
- సులభంగా బయటపడుతున్న నిందితులు

ప్రజాశక్తి - విజయవాడ : గంజాయి, మద్యం మత్తులో అరాచక గ్యాంగ్‌లు రెచ్చిపోతున్నాయి. విజయవాడ కృష్ణలంక, సింగ్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ గ్యాంగ్‌లు సృష్టిస్తున్న వీరంగంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయినా పోలీసులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉదాసీనత వైఖరి అవలంభిస్తున్నారు. అనేక తీవ్రమైన ఘటనలు జరిగినా కేసు నమోదు చేయకుండా 'సెటిల్‌మెంట్లు' చేసేస్తున్నారు. 'జనం ఫుల్...కేసులు నిల్' అన్న చందంగా తయారైంది పోలీసుస్టేషన్ల వద్ద పరిస్థితి. మాట వినకపోతే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇరువైపుల వారు స్టేషన్‌కు రాకుండా గేటు బయటే రాజీకుదుర్చుకుని వెళుతున్నారని, తమకు ఫిర్యాదు అందనప్పుడు కేసు ఎలా నమోదు చేస్తామని ఎదురుదాడికి దిగుతున్నారు. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. కృష్ణలంక 22వ డివిజన్ స్వర్గపురి రోడ్డులో శుక్రవారం ఇరుగ్రూపుల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. కార్లు పార్కింగ్ ప్లేస్‌లో జరిగిన ఈ ఘర్షణలో కార్ ట్రావెల్స్‌కు చెందిన ఓ యువకుడిని స్థానికంగా ఉన్న ఓ షాపుకు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా కొట్టారు. యువకుడి తలపగిలింది. అరుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది. స్వర్గపురి రోడ్డులో సుమారు గంటకుపైగా రెచ్చిపోయి కొట్టుకున్నారు. ఈ ఘటన జరిగిన ప్రదేశానికి కూత వేటు దూరంలోనే ఉన్న కృష్ణలంక పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు తీరిగ్గా అక్కడికి వచ్చారు. ఇరువైపుల వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. తలపగిలి తీవ్ర రక్తస్రావంతో ఉన్న బాధితుడిని పోలీసలే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన ఓ యువకుడిని పోలీసులు పరీక్షించి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. కానీ కృష్ణలంక పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదు. రాజీ పడ్డారనే పేరుతో నిందితులను హెచ్చరించి పంపేసినట్లు తెలిసింది. ఇటీవల ఈస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంటున్న పలు ఘటనల పట్ల కూడా పోలీసులు మెతకవైఖరి అవలంభించారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో ఎంతో ప్రశాంత (మిగతా 2లో)



దాడిలో తలపడిగి రక్తం కారుతున్న యువకుడు (పైన), సంఘటనా ప్రదేశానికి వచ్చిన పోలీసులు (కింద) - ఫైల్‌ఫొటోలు



రెడ్డిగూడెం మండలం రంగాపురం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ సుహాసిని

గురుకులాల్లో జ్వరాల నివారణకు చర్యలు

డిఎంహెచ్‌ఒ సుహాసిని

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం రంగాపురం, విస్సన్నపేట మండలం నరసాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో జ్వరం కేసులు ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డిఎంహెచ్‌ఒ) డాక్టర్ సుహాసిని ఆయా పాఠశాలలను పరిశీలించారు. రెండు పాఠశాలల్లో సమగ్ర జ్వరం సర్వే నిర్వహించారు. నరసాపురం గురుకులంలో గత వారం నుండి సాధారణ జ్వరాలను గుర్తించారు. ఒకరిద్దరికి జ్వరం వచ్చినట్లు తెలుసుకున్నారు. రంగాపురం గురుకులంలో జ్వరం కేసులు నమోదు కాలేదు. జిల్లా, స్థానిక వైద్య అధికారుల సహకారంతో వెంటనే తగిన చర్యలు తీసుకున్నారు. ఈ (మిగతా 2లో)

13న 'స్వాతంత్ర్య ఉద్యమ శంఖారావం' కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి - విజయవాడ : 78 స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య ఉద్యమ శంఖారావం కళా ప్రదర్శనలు ప్రదర్శించనున్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో 450 మంది విద్యార్థినీ విద్యార్థులు 'మా గమ్యం (భగత్‌సింగ్), స్ఫూర్తి (అల్లూరి సీతారామరాజు), వీర గంధం (కన్నెగంటి హనుమంతు) నాటికలు, ఇంకా పలు కళారూపాయలు, నృత్యాలు ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం తదితరులు పాల్గొంటారు.

పరిటాలలో వజ్రం లభ్యం ?

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో 52 క్యారెట్ల వజ్రం దొరికనట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వర్షాలు పడిన సమయంలో పరిటాల చెరువు వద్ద వజ్రాల కోసం కొంతమంది వెతుకు తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఒకరికి 52 క్యారెట్ల వజ్రం దొరికినట్లు సమాచారం. దీని విలువ బహిరంగ మార్కెట్లో రూ.4 కోట్లు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నట్లు తెలిసింది. అయితే దీనిని రూ.2.20 కోట్లకు అమ్మినట్లు సమాచారం. పరిటాల గ్రామాన్ని అప్పట్లో నిజాం నవాబు పరిపాలించారు. ఆ కాలంలో నిజాం నవాబులు ఇక్కడ వజ్రాలతో తులతూగారని చరిత్ర చెబుతోంది.



ఇంద్రకీలాద్రి కిటకిట



వార్త 8లో

ఉచిత బస్సు అమలుకు చర్యలు

- ప్రజాశక్తితో ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం





ప్రజాశక్తి - విజయవాడ

స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు దీని అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.వై దానం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సదుపాయం అమలులో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత బస్సు పథకం ద్వారా ఆర్టీసి సర్వీసుల్లో సుమారు 50 శాతం మహిళలకు సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. దీని ప్రకారం బస్సుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈనేపథ్యంలో అదనంగా మరికొన్ని సర్వీసులు నడపాల్సి వస్తోందని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని చెప్పారు. సగటు ప్రయాణీకుడికి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌టిసి జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, జిల్లాలో సర్వీసులు, ఒఆర్, రాబడి తదితర అంశాలపై ఆర్‌ఎం దానం ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు తీసుకుంటున్న చర్యలేమిటి ?

రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు అమలులో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తోంది. ఈ పథకాన్ని విజయవాడ నగరంతోపాటు ఎన్‌టిఆర్ జిల్లాలో అమలు చేయడానికి తమకున్న రిపోర్టు, ఇప్పటి (మిగతా 2లో)

తికమక లెక్కలు...గజిబిజి బిల్లులు

- స్మార్ట్ మీటరా....మజాకా !
- కొండపల్లి పారిశ్రామికవాడ యజమానులు లబోదిబో
- అదనపు ఛార్జీల మోతతో పరిశ్రమలు కుదేలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ప్రజలకు చౌకగా నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు పెట్టి తికమక లెక్కలతో గజిబిజి గందరగోళాన్ని సష్టిస్తున్నాయి. భారీగా విద్యుత్ బిల్లులు అందిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయి. ఈస్మార్ట్ మీటర్ల బిల్లుల సెగ చిరు వ్యాపారులనే కాదు కంపెనీలు నడిపే వారికీ తగులుతోంది. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమల యజమానులు ఈ బిల్లులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఆ యజమానులు చెప్పిన వివరాల ప్రకారం...ఇక్కడ మూడేళ్ల క్రితమే స్మార్ట్ మీటర్లు బిగించారు. విద్యుత్ వినియోగాన్ని బట్టి రోజులో నాలుగు కేటగిరీలుగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. విద్యుత్ వాడే సమయం ఆధారంగా యూనిట్ రేట్ మారుతోంది. ఉదయం 6 - 10 గంటల మధ్య యూనిట్‌కు రూ 1.00, ఉదయం 10 - సాయంత్రం 6 గంటల మధ్య యూనిట్‌కు రూ.6.30, సాయంత్రం 6:30 - రాత్రి 10 గంటల మధ్య పీక్‌లోడ్ సమయంలో రూ.7.30 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తున్నారు. పిక్ లోడ్ సమయం కాకుండా రాత్రి 10 - ఉదయం 6 గంటల మధ్య పెరిగిన యూనిట్ ధరపై రూపాయి తగ్గింపు ఇస్తున్నారు. కానీ ఆ సమయంలో ఉత్పత్తి కొనసాగాలంటే (మిగతా 2లో)

ఫోరంలో ఫిర్యాదు చేశా

డి.రాంబాబు, వినియోగదారుడు



ఇబ్రహీంపట్నంలో హర్ష ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ యజమాని డి.రాంబాబు మాట్లాడుతూ తనకు గతంలో రూ.15 వేల నుండి రూ.16 వేల వరకు విద్యుత్ బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత రూ.58 వేల బిల్లు వచ్చిందని తెలిపారు. దీనిపై సిజిఆర్ఎఫ్ కింద వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు వేసినట్లు తెలిపారు. తన ఇంటికి సైతం స్మార్ట్ మీటర్ పెట్టొద్దని సంబంధిత అధికారులకు తెలియజేసినట్లు వివరించారు.

ఖచ్చితత్వం కోసమే...

గురు ప్రసాద్, ఎడిఇ, ఇబ్రహీంపట్నం



ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న విద్యుత్ వాడకం, సరఫరా తదితర అంశాలు, విద్యుత్ నిర్వహణ ఆధునీకరణ, బిల్లింగ్ ఖచ్చి తత్వం మెరుగుదలకు, విద్యుత్ నష్టాలను తగ్గించడానికి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోంది. కొత్త బిల్లింగ్ వ్యవస్థకు మారడానికి ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తోంది. అదాని ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థ మీటర్లను ఏర్పాటు చేస్తోంది. బిల్లుల్లో ఏవైనా వ్యత్యాసాలు వస్తే చెక్ మీటర్ ఏర్పాటు చేసుకోవచ్చు. స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు. ప్రస్తుతం వీటిని వ్యాపార సంస్థలకు మాత్రమే బిగించాము.

కృష్ణమ్మ తీరాన కళా నృత్యాలు

పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : నగర చిన్నారులు, యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, గుర్తించి.. భావితరాలకు కళా సంపదను వారసత్వంగా అందించేందుకు విజయవాడ గాట్ టాలెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గత ఆదివారం మొదటి కేటగిరీలో ఆరేళ్లలోపు చిన్నారుల నృత్య పోటీలు జరగ్గా.. ఈ ఆదివారం హరిత బెరంపార్కులో రెండో కేటగిరీలో ఏడు నుంచి పదేళ్ల వరకు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఉల్లాసంగా జరిగాయి. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ అంటేనే కళలకు నిలయమన్నారు. ఈ కళా సంపద కనుమరుగు కాకుండా ఉండేందుకు, చిన్నారులు, యువతను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు, వారంలో ఆరురోజుల పాటు అలసిన మనసుల్లో కొత్త ఉత్తేజం నింపేందుకు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ పోటీలు దోహదం చేస్తున్నాయన్నారు. ఈ చొరవ మున్ముందు కూడా కొనసాగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

సామాజిక చైతన్యానికీ మార్గం

కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో వివిధ అంశాలపై సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకూ వీలవుతుందని కలెక్టర్ అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణహిత మార్గాలు వంటివాటిపై ఈ ప్రదర్శనల ద్వారా అవగాహన పెంపొందిస్తున్నట్లు తెలిపారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారానికి పర్యావరణ పరిరక్షణ కీలకమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి చెక్ పెట్టి.. స్వచ్ఛతా మార్గంలో ప్రజలు పయనించేలా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే అయిన విజయవాడను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు, రోల్ మోడల్‌గా నిలిపేందుకు జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ.. వివిధ భాగస్వామ్య పక్షాల సహాయంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యాటకంగా కూడా అభివృద్ధి సాధించేందుకు వినూత్నకార్యక్రమాలను కొనసాగించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వచ్చే ఆదివారం 11-15 ఏళ్ల కేటగిరీలో నత్య పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేసిన కళాకారులతో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు



బెరంపార్కులో జరిగిన నృత్య పోటీల్లో నృత్యం చేస్తున్న యువతులు


దాసరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నేతలు సత్యనారాయణ మూర్తి, విల్సన్; వనజ, దోనేపూడి, కోటేశ్వరరావు

పేదలకు అండగా నిలిచిన 'దాసరి'

శత జయంతి సభలో సిపిఐ రాష్ట్ర నేత జెవి

ప్రజాశక్తి - విజయవాడ

పేదల పక్షాన నిత్యం భూ పోరాటాలు చేసి, వేలాది ఎకరాల పంపిణీ జరిగేలా దాసరి నాగభూషణరావు కృషి చేశారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. దాసరి భవన్‌లో సీపీఐ అగ్రనాయకులు, రాజ్యసభ పూర్వ సభ్యులు దాసరి నాగభూషణరావు శత జయంతి సభ ఆదివారం జరిగింది. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతవర్గంగా వ్యవహరించారు. ముందుగా దాసరి చిత్రపటానికి పార్టీ, ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు పూలమాలలేసి జోహార్లర్పించారు. ఈసభలో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోరాటాలకు మారుపేరుగా దాసరి నిలిచారన్నారు. పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. ఎక్కడ పేదలకు అన్యాయం జరిగితే ఆయన అక్కడకు వెళ్లి ఉద్యమించేవారని, భూస్వాములు, పెత్తందారులు, జమీందారుల వ్యవస్థకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటాలు చేశారని కొనియాడారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ నూజివీడులో జమీందారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, కార్యకర్తలను భాగస్వాముల్ని చేసి భూ పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ పూర్వపు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, విశ్రాంత ప్రొఫెసర్ సి.నరసింహారావు తదితరులు మాట్లాడారు.

'హర్ ఘర్ తిరంగా'ను ప్రతి ఇంటికీ తీసుకెళ్లండి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి ఇంటికీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని తీసుకుని వెళ్లాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. రాఘవయ్య పార్కులో ఠాగూర్ స్మారక గ్రంథాలయం, బ్రైట్ మైండ్స్ సంయుక్త ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ విఆర్‌కె వాణిజ్య విభాగం వారు ఆదివారం నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో 300 వరకు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలు గీసిన చిత్రాలను హర్ ఘర్ తిరంగా వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, బ్రైట్ మైండ్స్ డైరెక్టర్ స్వాతి పూర్ణిమ, లయన్స్ క్లబ్ విఆర్‌కె వాణిజ్య చైర్‌పర్సన్ ప్రభుజీ, గోరా సైన్స్ ప్రెసిడెంట్ నియంత, ప్రముఖ యాంకర్ చంద్రిక, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి పాల్గొన్నారు.



సిపిఐ రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 20 నుండి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే సిపిఐ 28వ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు లంక దుర్గారావు, బుట్టిరాయప్ప, పంచదార్ల దుర్గాంబ, లంకా గోవిందరాజులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

ఉచిత బస్సు అమలుకు చర్యలు

వరకు మహిళల టికెట్ల నమోదు ఒఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) 50 శాతం ఆధారంగా చేసుకొని వారికి బస్సుల ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రాథమికంగా ఇప్పుడున్న బస్సులు సరిపోయినా భవిష్యత్ అవసరాల దృష్ట్యా సర్వీసుల సంఖ్యను పెంచాల్సి ఉంటుంది. ప్రస్తుతం మొత్తంగా ఒఆర్ 65 శాతం కాగా, దానిలో మహిళల ఒఆర్ 30 నుంచి 35 శాతం వరకు ఉంటుందని అంచనా. ఆ సంఖ్యకనుగుణంగా ఉచిత బస్సులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటిని భర్తీ చేసేందుకు అన్ని రకాల కసరత్తులు ప్రభుత్వం చేస్తోంది.

ప్రశ్న : ప్రభుత్వం ఎలక్ట్రికల్ బస్సులు జిల్లాకు ఎన్ని కేటాయించబోతోంది ?

వంద ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయి. పొల్యూషన్ నియంత్రణ, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకొని సిటీలో ఉన్న 350 సర్వీసులను ఎలక్ట్రికల్ సర్వీసులుగా మార్చివేసి నడపాల్సి ఉంటుంది. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణకు అవసరమైన విద్యాధరపురం డిపోను ఇందుకు వినియోగించనున్నాము.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని సర్వీసులు ఉన్నాయి ? ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నాయి ? ఎంత రాబడి వస్తోంది?

జిల్లాలో మొత్తం 800 సర్వీసులున్నాయి. రోజుకు రెండు లక్షల 70 వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నాయి. రూ.1.10 కోట్ల మేర రాబడి ఉంటుంది.

ప్రశ్న : సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ వద్ద ఆర్టీసి మినీ డిపోకు కేటాయించిన స్థలం వినియోగానికి ఆర్టీసీ యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకుంటోంది ?

సింగ్‌నగర్‌లో ఆర్టీసి డిపో ఏర్పాటుకు విజయవాడ నగర పాలక సంస్థ కేటాయించిన రెండు ఎకరాలు స్థలం ఎంతో విలువైంది. దీనిని సద్వినియోగం చేసుకోవడానికి సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళతా.

ప్రశ్న : ఆర్టీసికి చెల్లించాల్సిన అద్దెలు భారీ స్థాయిలో రాకుండా, ఏళ్ల తరబడి మూతపడిపోయిన సినిమా హాల్ నిర్వాహకులపై ఏచర్యలు తీసుకుంటున్నారు ?

డిపార్చర్ బ్లాక్‌లో మూతపడిపోయిన 'వై స్క్రీన్' సినిమా హాలు మొత్తాన్ని ఆర్టీసి యాజమాన్యం టేకొవర్ చేసుకుంది. ఆర్టీసి సంస్థకు సుమారు కోటి రూపాయల వరకు బకాయి రావాల్సి ఉంది. అయితే ఈ సినిమాహాల్‌లో ఉన్న ఫర్నీచర్, ఇతర సామానులు, దాని మొత్తం కోటిన్నర వరకు ఉండొచ్చని అంచనా వేశాం. వీటిని స్వాధీనం చేసుకుంటాం. ఆగస్టు 9, 10 తేదీల్లో దీనికి టెండర్లను ఆహ్వానిస్తాం. మళ్లీ అదే ప్లేస్‌లో సినిమాహాల్ రన్ చేసే వారికి ఎలాట్ చేస్తాం.

ప్రశ్న : పిఎన్ బస్‌స్టేషన్ చుట్టూ భారీ సంఖ్యలో పార్కింగ్ చేసి ఉంటున్న ప్రయివేటు వాహనాల తాకిడి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రయివేటు వాహనాల తాకిడిని నివారించడానికి షిఫ్టుల వారీగా సిబ్బందిని కేటాయిస్తున్నాం. ప్రైవేటు వాహనాలను బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రధాన రహదారితోపాటు చుట్టుపక్కల ప్రయివేటు ట్రావెల్స్, కార్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసి ప్రయాణీకులను ఎక్కించుకోకుండా ఉదయం, రాత్రి సమయాల్లో షిఫ్టుల వారీగా ఆర్టీసి సిబ్బందిని కేటాయించి ప్రయివేటు వాహనాల తాకిడిని అరికడుతున్నాం. ఆర్టీసి ప్రాంగణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ట్రావెల్స్, కార్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. సాధ్యమైన మేరకు ఈ ప్రాంతంలో ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

గురుకులాల్లో జ్వరాల నివారణకు చర్యలు

సందర్భంగా డిఎంహెచ్ఒ సుహాసిని మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో తీసుకున్న పరిశుభ్రతా చర్యలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, రెడ్డిగూడెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, సబ్ యూనిట్ అధికారి బాబావలి, గురుకుల ప్రిన్సిపాల్ తబిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాం సుందరరావు, సూపర్‌వైజర్లు రాంకుమార్, భవాని, హెల్త్ సిబ్బంది నాగేశ్వరరావు, ప్రతాప్, శిరోతేజస్విని, జీనత్ పాల్గొన్నారు.

తికమక లెక్కలు...గజిబిజి బిల్లులు

కార్మికులు అందుబాటులో ఉండని పరిస్థితి ఉంటుంది. దీంతో పరిశ్రమలపై అదనపు భారం పడుతోంది. కొండపల్లి పారిశ్రామిక వాడకు గతంలో నెలకు రూ.32 లక్షలు వచ్చేది. స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత రూ.43 లక్షలు వస్తోంది. దాదాపుగా రూ.8 లక్షలు భారం పరిశ్రమలపై అదనంగా పడుతోంది. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి పెంచుతామని చెబుతున్న టిడిపి కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు ఇవ్వాల్సిన రాయితీల గురించి కనీసంగా పట్టించుకోకుండా, వివిధ రకాల స్లాబులు, రకరకాల ఛార్జీల పేరుతో ఇప్పుడున్న పరిశ్రమలపై విద్యుత్ అదనపు భారాన్ని మోపుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశ్రమలు నిలదొక్కుకోవడనికి అవసరమైన చర్యలు చేపట్టాలని కొండపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు. మరోవైపు కొండపల్లి పారిశ్రామికవాడలోని చిన్న చిన్న వ్యాపారులు సైతం తమపై పలు రకాల ఛార్జీల పేరుతో విద్యుత్ భారం పెరిగిపోతోందని వాపోతున్నారు. చిన్న కూలర్ల వ్యాపారం చేసుకునే వారు గోడౌన్‌గా ఉపయోగించిన గహాలకు సైతం క్యాటగిరీలు మార్చేసి అదనపు విద్యుత్ భారాన్ని మోపుతున్నారని ఆందోళన చెందుతున్నారు.

రక్తమోడినా... కేసులుండవ్ !

వాతావరణంలో ఉండే కృష్ణలంక 22వ డివిజన్ పద్మావతి ఘాట్, స్వర్గపురి రోడ్డు, కృష్ణానది పరీవాహక ప్రాంతంమైన రిటైనింగ్ వాల్ వెంబడి, రాణిగారితోట, రామలింగేశ్వర్‌నగర్, భ్రమరాంభపురం ఫీడర్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో గంజాయి, మద్యం ఏరులై పారుతోంది. దీంతో సాయంత్రమైతే చాలు స్వర్గపురి, పద్మావతి ఘాట్ పరిసర ప్రాంతాలన్నీ మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారు. గత ఐదారు నెలల వ్యవధిలోనే అనేక ఘటనలు, ఘర్షణలు చోటు చేసుకున్నా పోలీసులు తెలియనట్లు వ్యవహరించడం సర్వసాధారణంగా మారింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి, మరోసారి ఇటువంటి ఘటనలకు దారితీయకుండా చర్యలు తీసుకోవడంకానీ, గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకోవడం కానీ మచ్చుకైనా కనిపించడం లేదు. గంజాయి, మద్యం సేవించి ఆగడాలకు పాల్పడితే ఉక్కుపాదంతో అణిచివేస్తామంటూ పోలీసు అధికారులు చేస్తున్న ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప నిందితులు మరోసారి ఆగడాలకు పాల్పడకుండా శాశ్వత చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

గన్నవరం ఎఎంసి చైర్మన్‌గా నరసయ్య

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఎమ్మెల్యే తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన పదవి ఏఎంసీ చైర్మన్. ఆ పదవిని పార్టీలోని సీనియర్ నాయకులకు ఇప్పించడంలో కాస్త.. ఆలస్యమైనా ఎమ్మెల్యే యార్లగడ్డ సక్సెస్ అయ్యారని పలువురు అంటున్నారు. ఏఎంసి గన్నవరం గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చైర్మన్ గా గూడవల్లి నరసింహారావు, వైస్ చైర్మన్ గా కొండేటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా.. అర్నేపల్లి రామలక్ష్మి, జీ. వరలక్ష్మి, శివ లీల, స్వాతి, వనజారాణి, జి. రాజేశ్వరరావు, పి. మల్లికార్జున్ రావు, శేషు మాధవి, సాతులూరి కోటేశ్వరరావులను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జీవో నెంబర్ 77 ద్వారా నూతన కమిటీని ప్రకటించారు.

పట్టు సాధించిన ఎంఎల్ఎ యార్లగడ్డ : గతంలో ఏఎంసి పదవిని జనసేన పార్టీకి చెందిన బాపులపాడు గరికపాటి శివశంకర్ కేటాయించారు. అయితే ఆయనకు నియోజక వర్గంలో ఏ విధమైన సంబంధాలుగాని, పార్టీలో ఉండి గ్రామాల్లో పనిచేయడం గాని లేదు. జనసేన రాష్ట్ర కార్యాల యంలో ఉంటూ పెద్దలను పట్టుకో వడంతో ఈ పదవి కేటాయిం చారు. అయితే ఈసారి పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకుఆ పదవి దక్కాలనే ఉద్దేశంతోనూ, పార్టీలో పట్టు బిగించాలని ఉద్దేశంతో యార్లగడ్డ చాలా ప్రెస్టేజ్ గా తీసు కొని అటు ప్రభుత్వంలోనూ, ఇటు లోకేష్ వద్ద చక్రం తిప్పారు. అంతే తిరిగి ఏఎంసి పదవి ఆయన గూట్లోకి వచ్చేసింది. ఏఎంసీ నూతన చైర్మన్ గా గన్నవరం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు కు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గూడవల్లి నరసింహారావు (నరసయ్య)కు ఇచ్చారు. ఆయన యార్లగడ్డకు ప్రధాన అనుచరుడుగా కొనసాగుతున్నారు. ఈయన 2010 నుంచి టిడిపి పార్టీలో కొనసాగుతున్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చారు. గతంలో ఏలూరు కాలువ మళ్లింపుకు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటంలో వామపక్షాలతో కలిసి ముందుకు నడిచారు. నిజం చెప్పాలంటే ఆయన కుటుంబం వామపక్ష భావజాలం కలిగి ఉంది. అందుకే కొన్ని నెలల పాటు జరిగిన ఏలూరు కాలువ మళ్లింపు పోరాటంలో తన వంతు పాత్ర పోషించారు. కేసులకు సైతం వెనుకాడకుండా ముందుకు సాగారు. తాను ఎప్పుడు చెప్పినా కమ్యూనిస్టు కుటుంబం నుంచే వచ్చానని చెబుతారు. కొన్ని అనివార్య కారణాలవల్ల 2010 నుంచి టిడిపిలోకి వెళ్లాల్సి వచ్చిందని ఆయన అంటున్నారు. యార్లగడ్డ గెలుపు కోసం ఆయన చేసిన కషికి గుర్తింపుగా ఏఎంసీ పదవి ఇస్తానని గూడవల్లికి ప్రారంభంలోనే చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే తన మాటను నిలబెట్టుకుంటూ ఉత్తర్వులు రప్పించారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గా గూడవల్లి నరసింహారావు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పదవి రూరల్ మండలానికి రెండవసారి కేటాయించడం జరిగింది.



గూడవల్లి నరసింహారావు



మిస్సెస్ ఇండియా విజేతకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : మిస్సెస్ ఇండియా-2025 విజేత విజయలక్ష్మీ హైదరాబాద్ నుంచి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం చేరు కున్నారు. ఈ సందర్భంగా గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, పలువురు నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అవార్డు రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన విజయవాడ బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ప్రముఖులు నిడమర్తి నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మూడు సంవత్స రాలుగా మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో 650 పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం -మహాదానం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని వేడుక ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న బెల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. గత రెండు వారాలుగా సామాజిక మాధ్యమాలలో రక్తదానం శిబిరం గురించి విస్తత ప్రచారం గావించి మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి రక్తనిధి సిబ్బంది సహకారంతో నేడు దాదాపు 50 మంది రక్తదాతల నుండి రక్తం స్వీకరించి సర్వజన ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు కూ విరాళంగా ఇచ్చారు.. ఈ మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపర్నిటెండెంట్ డాక్టర్ ఆశాలత , అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు లాయర్ లంకిశెట్టి బాలాజీ , బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి డాక్టర్ పావని హాజరైయ్యారు. సభకు అధ్యక్షత వహించిన మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్ మాట్లాడుతూ రక్తదానం, అవయవదానం గురించి ప్రాథమిక విద్య నుండే బాల బాలికల హదయాల్లో నాటుకునే విధంగా కషి జరగాలని అన్నారు. ఉపాధ్యక్షుడు కాసాని ప్రసాద్, గ్రామం పిల్లారి శెట్టిపాలెం గ్రామానికి చెందిన 24 మంది యువకులు రక్తదానం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఏఆర్కే వరప్రసాద్ ,సహకార్యదర్శి దీప్తి గ, బ్లడ్ కమిటీ చైర్మన్ రమాదేవి , ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్ , సభ్యులు రామకృష్ణ మాస్టారు, నిరంజన్ రావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వసతిగదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని తాడేపల్లి గ్రామంలో వేద పాఠశాల ఏర్పాటులో భాగంగా విద్యార్థుల వసతి గదుల నిర్మాణానికి ఆదివారం మూల్పూరి వెంకట్రావు - సావిత్రి దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ సాంస్క్రిట్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జ్ఞాన్ రంజన్ పాండ, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కావూరి కోదండ రామయ్య, మొవ్వ శ్రీరామ్మూర్తి, వేమూరి శివయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు గ్రామంలో బోడె ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్, ఫినిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గత 20 సంవత్సరాలుగా బోడె ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవ చేస్తున్నారని అన్నారు. ప్రతినెలా ఎంతోమందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారని, ఇప్పుడు యువ నాయకులు బోడే వెంకట్ రామ్ కూడా ప్రజలకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మెడికల్ క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్ కూడా చేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. యువ నాయకులు బోడే వెంకట్ రామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : ఆయుర్వేదం అనేది భారత ఉపఖండంలో చారిత్రిక మూలాలను కలిగి ఉన్న ప్రత్యామ్నాయ వైద్య విధానం అని ప్రముఖ సీనియర్ ఆడిటర్ చిలకమర్రి శేషాచార్యులు (అప్పాజీ) అన్నారు. యోగ ప్రభ శ్రీ వైద్యశాల ఆయుర్వేద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నేతత్వంలో ఆదివారం మచిలీపట్నం లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. నగర కార్పొరేషన్ 45వ డివిజన్ సచివాలయంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, డాక్టర్ ముత్తేవి కష్ణమాచార్యులు, డాక్టర్ ముత్తేవి రాజా రవి కిరణ్ లు జ్యోతి ప్రజ్వలన చేసి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ప్రారంభించారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. .తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య), గొర్రెపాటి గోపీచంద్ డివిజన్ ఇంచార్జ్ పి వి ఫణి కుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని యనమలకుదురు సుగాలీ కాలనీలో కరువుకాల్వకు లింక్ చేసిన ప్రధాన మురుగునీటి డ్రైనేజీకు వెంటనే మరమ్మతులు చేస ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఆదివారం ధర్నా నిర్వహించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సెప్టెంబర్‌లో వచ్చిన వర్షాల కారణంతో ఈ డ్రైనేజీ కూలిపోయిందనీ, సంవత్సరం కావస్తున్నా అధికారులు, పట్టించుకోలేదని అన్నారు. యనమలకుదురు ప్రధాన గ్రామం, శివాలయం ప్రాంతం, భగతసింగ్ నగర్, వైఎస్సార్ నగర్, అంబేద్కర్‌నగర్, బి.సి.కాలనీ తదితర ప్రాంతాలలో నివసిస్తున్న వేలాదిమంది ప్రజలు వాడుతున్న మురుగునీరు మొత్తం ఇక్కడి డ్రైనేజీ ద్వారానే కరువు కాల్వలో కలుస్తోందని, ఇది కూలిపోయి పరిసర ప్రాంతా ల్లో మురుగునీరు నిలిచిపోయిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన మరమ్మతులకు నోచుకోకపోవటంతో నివాస ప్రాంతాలన్నీ మురుగునీటి మయం కావటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీరి ఆందోళనకు సిపియం పెనమలూరు మండల కార్యదర్శి షేక్ ఖాసిం మద్దతు తెలిపారు. సుగాలీలు, పేద ప్రజలు నివసిస్తున్న ప్రాంతంలో డ్రైనేజీ కూలిపోయి సంవత్సరం అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించచటం శోచనీ యం అన్నారు. ఆ ఆందోళనలో స్థానికులు వి.శ్రీనివాసరావు, ఎన్.భారతి, జె.శివనాయక్, ఎ.బాబూ రావు, ఎన్.చిట్టి, ఎన్.హరిబాబు, సాయిచరణ్‌లతో పాటు సిపియం నాయకులు పి.మాధవ, నాయకులు వి.శ్రీరాములు, యం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి

కొత్త వ్యక్తులు కనబడితే సమాచారమివ్వాలి : మెరైన్ ఎస్ఐ

ప్రజాశక్తి-కోడూరు : సముద్రంలో వేటకు వెళ్ళినప్పుడు కొత్త వ్యక్తులు తరసపడితే వెంటనే 1093 కి సమాచారం ఇవ్వాలని పాలకాయతిప్ప మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి అన్నారు. ఆదివారం పాలకాయతిప్ప గ్రామంలో అటవీశాఖ, మత్స్య శాఖ, మెరైన్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్తులకు సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ స్వాతంత్రదినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని శత్రుముకలు సముద్రంలో నుంచి గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని కావున మత్స్యకారులు వేటకు వెళ్ళినప్పుడు కొత్త వ్యక్తులు తరసపడితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మెరైన్ ఏఎస్ఐ పోతురాజు, అటవీ శాఖ అధికారి వి.సత్యనారాయణ, సంఘమిత్ర సిహెచ్ మోజెస్, వీఆర్వో లు కే.అర్జున్, ఎన్. గోపీచంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దళితులపై దాడిచేస్తే జైల్లో ఉంచాలి : టిడిపి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : దళితులపై దాడి చేసినోళ్లను శాశ్వతంగా జైల్లో ఉంచి నపుడే దళితుల ఆత్మాభిమానం కాపా డినట్లు అవుతుందని టిడిపి మచిలీపట్నం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలు దేవరపల్లి అనిత,చిన్నం శేఖర్ అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడి అండదండలతోనే తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత కార్యకర్త పవన్ పై దాడి జరిగింది, దాడి చేసిన వారికి బెయిల్ ఇవ్వడం కాదు నేరుగా జైలుకు పంపించాల్సిందేనని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దళితులపై దాడులు చేసేవారు చట్టం నుండి తప్పించుకోవడానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను జగన్ రెడ్డి ఎందుకు ఖండించడం లేదు? దళితులు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పనికొస్తారా అని నిలదీశారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బురకా బాలాజీ, పలువురు ఎస్ సి సెల్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు ముఖ్యమంత్రి ఆశీర్వాదం




ప్రజాశక్తి-కంకిపాడు : పోరంకిలో శ్రీలక్ష్మీ నరసింహ గార్డెన్స్ లో జరిగిన అడుసుమిల్లి వారి నూతన వస్త్రబహుకరణ వేడుకకు సీఎం చంద్రబాబు హాజరై చిన్నారులను ఆశీర్వదిం చారు. ముఖ్యమంత్రి బందో బస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్, ఎస్పీ ఆర్ గంగాధరరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎమ్మెల్యే లు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా,ఆర్డీవో హేలా షారోన్ పాల్గొన్నారు.

కొందరు ఉపాధ్యాయుల లైంగిక వేధింపులపై ఫిర్యాదులు !

ప్రజాశక్తి-నందిగామ: జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు పలువురు విద్యార్థినులు సోషల్ ఆడిట్‌కు వచ్చిన బృందానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు సంబంధించిన పలువురు విద్యార్థినులు ఆయా పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడం జరిగింది. నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం చందర్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిపై 25 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. తమను చెప్పుకోకూడని చోట తాకుతూ తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని వారు రాసిన లేఖలో పేర్కొనడం జరిగింది. తమతో పాటు చాలామంది బాధితులు ఉన్నారని వారంతా ధైర్యం చేసి చెప్పుకోలేకపోతున్నారని వాపోడం జరిగింది. సదరు ఉపాధ్యాయుడు గురించి కొందరు ఉపాధ్యాయనిలకు చెప్పగా వారు హెచ్‌ఎంకి సమాచారం ఇచ్చినా స్పందన లేదంటున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మరో పాఠశాలలో ముగ్గురు విద్యార్థినులు ఒక ఉపాధ్యాయుడిపై ఇలాంటి సంఘటన సంబంధించి లైంగిక ఆరోపణలపై ఫిర్యాదులు చేశారు. ఇటీవల పాఠశాలల్లో ఏం జరుగుతుందనే అంశాలపై అధ్యయనం చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ ఆడిట్ పేరుతో సమగ్ర విషయ సేకరణ నిర్వహించాలని ఆదేశించారు.

కొద్దిరోజులుగా ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతుంది. ఈ సోషల్ ఆడిట్ ద్వారా విద్యార్థులతో, తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలో జరుగుతున్న సంఘటనలు, నెలకొన్న సమస్యలు మెరుగు పరిచేందుకు చేపట్టాల్సిన అంశాలపై అధికారులు సలహాలు తీసుకుంటున్నారు. సాధారణ సమస్యలు తెలుపుతాయని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్ లో భయంకరమైన నిజాలు బయటపడుతున్నాయి. సోషల్ ఆడిట్ జరిగిన పాఠశాలల హెచ్‌ఎంలతో ఇటీవల విజయవాడలో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా జరిగిన పలు ఆకృత్యాలను ఆడిట్ బృందం వివరించింది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను హెచ్చరించింది. కీచక ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎంలు తెలిపారు ఇంకా ఎంతో మంది విద్యార్థులు కీచక ఉపాధ్యాయుల చేతులలో నలిగిపోతున్నారో తెలియాల్సి ఉంది. ఆడిట్ బందాలు విద్యార్థుల బ్యాగులు, జేబులు పరిశీలించగా గుట్కా ప్యాకెట్లు, సిగరెట్లు కనిపించాయి. వ్యసనాలకు అలవాటు పడిన కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులతో మద్యం, గుట్కా ప్యాకెట్లు, సిగరెట్లు తెప్పించుకున్నట్లు తెలిసింది. ఈ అంశాన్ని అలుసుగా తీసుకున్న విద్యార్థులు కూడా వీడియోలు చెడు అలవాట్లు కు పాల్పడుతున్నారని సమాచారం. విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న లైంగిక ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి పనులు ఎవరు చేయకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.



పూర్వ గ్రామస్తుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఆదర్శవంతంగా, వినూత్నంగా గ్రామం నుండి గత నాలుగు దశాబ్దాలుగా వివిధ (జీవనోపాధి, వ్యాపారం,విద్యా, ఉద్యోగం, ఇతర) కారణాలు రీత్యా వెళ్లి జీవిస్తున్న పూర్వ గ్రామస్తుల కుటుంబాలను గ్రామానికి ఆహ్వానించారు. పూర్వ గ్రామస్తులని కలవడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్, మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పి ఎస్పీ డి.జానకి అన్నారు. సమాచార హక్కు కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాచార హక్కును జర్నలిస్ట్ లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలో 17 వేల కేసులు పెండింగ్ లో ఉన్నాయని, 2003 నుండి నిలిచిపోయిన కేసులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు.

సొసైటీలకు ఛైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘానికి ఛైర్ పర్సన్‌గా నియోజక వర్గ తెలుగు యువత నాయకులు దూళిపాళ లక్ష్మణరావు, కృష్ణ ఫార్మర్స్ సొసైటీ ఛైర్ పర్సన్‌గా అనుమంచిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి రైతు నాయకులు యానాల గోపీచంద్‌లను నియమించారు. గోపాలకృష్ణ సొసైటీ సభ్యులుగా మాజీ కౌన్సిలర్ గుంజా ఏడు కొండలు, గోగుల వసంత, కృష్ణా ఫార్మర్స్ సొసైటీ సభ్యులుగా వేదాద్రికి చెందిన మూడు సునీత, షేర్ మహమ్మద్ పేటకు చెందిన మెట్లెల రామారావు నియమించబడ్డారు.

మద్యం దుకాణంలో వివాదం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ముక్త్యాల రోడ్డులోని ఒక మద్యం దుకాణం వద్ద జరిగిన స్వల్ప వివాదంలో మండలంలోని ముక్త్యాల గ్రామానికి చెందిన రామిశెట్టి ఆంజనేయులు (25) అనే వ్యక్తి గాయపడ్డ సంఘటన ఆదివారం జరిగింది. ఆంజనేయులు మిత్రులతో కలిసి మద్యం సేవించేందుకు రాగా విలియంపేటకు చెందిన ప్రసాద్, అచ్చిలు, పుల్లయ్య అనే వారు మద్యం సేవించేందుకు వచ్చారు. వారి మధ్య మాటా మాట పెరిగి స్వల్ప వివాదం కాస్త ముదిరి బీర్ బాటిల్ తో ఆంజనేయులు తలపై మోదటంతో గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం తరలించారు. జగ్గయ్యపేట ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్యుమ్యాక్స్ ప్రదర్శనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అల్యూమినియం ఉత్పత్తులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 10 నుండి 13వ తేదీ వరకు అలు మ్యాక్స్ 2025 పేరుతో ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు పి. రామరాజు తెలిపారు. నగరంలోని ఓ హోటల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. అల్యూమినియం రంగంలో ఉన్న అవకాశాలు, ముఖ్యంగా మన రాష్ట్రంలో ఈ పరిశ్రమ భవిష్యత్తు తదితర అంశాలపై సదస్సులు చర్చిస్తారని అన్నారు. సదస్సు ఢిల్లీ నందు జరుగుతుందని, ఈ ప్రదర్శనలో 200 పైగా స్టాల్ నిర్వాహకులు పాల్గొంటారని అన్నారు. 12 వేల మందికి పైగా సందర్శకులు పాల్గొంటారని అన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుండి పెద్దఎత్తున పాల్గొంటారని అన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తిరువూరు: కూటమి ప్రభుత్వం మద్యం షాపు దుకాణాలలో 10 శాతం కల్లుగీత కార్మికులకు మంజూరు చేసినందుకు గౌడ్ సంఘం ఆధ్వర్యంలో తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి గీత కార్మికులతో కలిసి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం పాలాభిషేకం చేశారు. కల్లుగీత కార్మికులు కూడా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం మద్యం దుకాణాల ఏర్పాటులో 10 శాతం భాగస్వామ్యం కల్పించటం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు.



బిజెపి విధానాలను వ్యతిరేకించాలి : సిఐటియు



ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక రాణిగారితోట ప్రాంతంలో వివిధ రంగాల కార్మికులతో సీఐటీయూ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు తూర్పు సిటీ నాయకులు ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు చూస్తుందన్నారు. దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముక్కలు చేసి అమ్మాలని విష ప్రయత్నాలు చేస్తుందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు పావులు కదుపుతుందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా విభజన హామీలు అమలు చేయకపోయినా రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీస్తున్నా కేంద్ర ప్రభుత్వ విధానాలను కూటమి ప్రభుత్వం ప్రశ్నించడంలేదని విమర్శించారు. మరోపక్క పేదరికం అసమానతలు ప్రజల్లో విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఉన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరుగుతుందన్నారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు భారమైపోయాయయన్నారు. కొత్తగా స్మార్ట్ మీటర్లు తెచ్చి వినియోగదారుల జేబులు కొల్లగొడుతున్నారన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాడే సిఐటియు యూనియన్‌కు కార్మికులు మద్దతు తెలపాలన్నారు. ఈ సమావేశంలో తూర్పు సిటీ సిఐటియు నాయకులు తమ్మిన చంద్రశేఖర్, డి.వరప్రసాద్, కృష్ణ, కోటిరెడ్డి, ఈశ్వర్, ఆదాం, మోహన్‌రావు పాల్గొన్నారు.



రోడ్డుపై నీరు నిలబడకుండా చూడాలి

ప్రజాశక్తి-వత్సవాయి

సాగర్ కాలువకు నీరు వచ్చిన ప్రతి సారి రోడ్డునూ నీరు ఉండడంతో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయంకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి బి.రాము అన్నారు. అయినా ధైర్యం చేసుకొని ప్రజల నీటిలో వెళ్తుంటే పాములు, తేళ్ల విషపూరితమైనవి ఉంటున్నాయన్నారు. కాలువ ఆక్రమణకు గురైందని ఈ ఆక్రమణల వలనే కాలువ కుదించుకుపోయిందని, పూడికతీత పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-తిరువూరు: ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరువూరు మండలం చింతలపాడు వెటర్నరీ డిస్పెన్సరీ నూతక్కి రాఘవరావు రెండోసారి ఎన్నికయ్యారు. విజయవాడలోని పశువుల ఆసుపత్రిలో ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అసోసియేట్ అధ్యక్షులుగా ఆర్.రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.గంగయ్య, ఎస్.హేమామణి, పి.మూర్తి, సిహెచ్.లక్ష్మీకాంత, కె.శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ..తిరిచంద్రయ్య, కార్యదర్శులుగా ఎ.సురేష్, కె.స్రవంతి, డి.హేమారెడ్డి, పి.శ్రీనివాస్, జె.సతీష్, కోశాధికారిగా టి.రామకష్ణలు ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు.



ముత్యాలమ్మకు ప్రత్యేక అలంకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవిగా రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. దేవస్థాన కమిటీ ప్రెసిడెంట్ అప్పన మణికుమార్, వైస్ ప్రెసిడెంట్ నోముల శివకుమార్, సెక్రెటరీ కొత్త రమేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ కొంకిమళ్ల సురేష్, కోశాధికారి అప్పన వెంకట పిచ్చయ్య పాల్గొన్నారు.



సారె మహోత్సవం

ప్రజాశక్తి-మైలవరం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మైలవరంలోని కోట మహాలక్ష్మి అమ్మవారి శ్రావణమాసం సారె మహోత్సవాన్ని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కాలిక నృత్య ప్రదర్శనతో భక్తులు పురవీధులలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించి సారెను సమర్పించారు.

వార్డు కన్వీనర్లకు సత్కారం

ప్రజాశక్తి-వత్సవాయి

నియోజవర్గ స్థాయిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు వార్డు కన్వీనర్లను, కోకన్వీనర్లను క్లస్టర్ ఇంచార్జ్ చుంచు రమేష్‌తో కలిసి టిడిపి మండల అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి, మాజీ ఛైర్మన్ కర్ల వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరిచ నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరరావు, నల్లమనేని తిరుపతిరావు, హై స్కూల్ ఛైర్మన్ సముద్రాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

'వర్ణం' కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సీనియర్ జర్నలిస్ట్ బోణం గణేష్ రచించిన తొలి పుస్తకం వర్ణం కవితా సంపుటి ఆవిష్కరణ ఆదివారం బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో జరిగింది. ఆర్ట్ ఫౌండేషన్, త్రివర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్రివర్ణోత్సవం పేరుతో నిర్వహించిన జాతీయ కవితా మహోత్సవం-5 వేడుకల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పొట్లూరి హరికృష్ణ, అమరావతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెల్లంకొండ విజయలక్ష్మి, సాహిత్యపోషకులు గోళ్ల నారాయణ, కార్యవర్గం లహరీ మహేందర్ గౌడ్, నందివాడ చిన్నాదేవి, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన రచయితలు, కవులు పాల్గొన్నారు. సామాజిక అంశాలనే ఇతివృత్తంగా తీసుకుని గణేష్ రాసిన కవితలను వారంతా కొనియాడారు. సమాజహితం కోసం రాసిన కవితలు ఓ అధ్యాయంగానూ, స్వఅనుభవ రచనలు మరో అధ్యాయంగానూ మలచి రెండు అధ్యాయాలుగా ఈ వర్ణం పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. ఇంతటి స్ఫూర్తిదాయక పుస్తకాన్ని రచించిన గణేష్‌ను నిర్వాహకులు శాలువ, మెమెంటో, ధ్రువపత్రంతో ఘనంగా సత్కరించారు.



అధ్వానంగా ఉన్న పెంజెంద్ర-గుడ్లవల్లేరు







అడుగు పడదు...కాలు కదలదు

• గుడ్లవల్లేరు మండలంలో ప్రధాన రహదారుల దుస్థితి !

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు మండలంలోని కౌతవరం నుంచి డోకిపర్రు వెళ్లే రహదారి పూర్తిగా గతుకుల మయంగా మారింది. అలాగే గుడ్లవల్లేరు- ముదినేపల్లి రోడ్డు, పెంజెంద్ర – గుడ్లవల్లేరు ప్రధాన రహదారుల్లో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. వాహన చోదకులకు తమ ప్రయాణంలో ప్రత్యక్ష నరకం కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే రోడ్లపై గోతుల్లో వర్షపునీరు చేరి ఎంత లోతు ఉందో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. వెంటనే ఈ రోడ్లను నిర్మించాలని స్థానికులు కోరుతు న్నారు. ఇదిలా ఉంటే ఈ రోడ్ల నిర్మాణం చేస్తున్న ప్రభుత్వ తీరు అగమ్య గోచరంగా ఉందని చెప్పటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

దిక్కు తోచని స్థితిలో రోడ్ల పనులు...

గుడ్లవల్లేరు నుంచి పెంజెంద్ర రోడ్డుకు మరమ్మత్తులను నిర్మించేందుకు రూ.50 లక్షల నిధులను ప్రభుత్వం వారు కేటాయించారు. కానీ ఆ పనులు నిర్వహించవలసిన కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయారు. అలాగే గుడ్లవల్లేరు నుంచి డోకిపర్రు రోడ్డు నిర్మాణం పరిస్థితి కూడా అగమ్య గోచరంగానే తయారయింది. ఆ రోడ్డును కాంట్రాక్టర్‌కు బిల్లులు రావడం లేదని వదిలేసి కనబడకుండా పోయారు. గుడ్లవల్లేరు నుంచి ముదినేపల్లి రోడ్డు పనులకు ప్రభుత్వం రూ2.50కోట్లను కేటాయించింది. ఆ రోడ్డు పనులను ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కాని ఇంతవరకు ఆ పనుల నిర్వహణ జాడే లేకుండా పోయింది.

అడుగు వపడటం లేదు : ఇంటూరి దావీదు, జేమ్స్‌పేట



ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు ప్రధాన రోడ్డులో అడుగు వేయాలంటే ముందుకు సాగటం లేదు. అన్నీ మోకాలు లోతు గోతులు, గతుకులే. ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా... పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా మా రోడ్డుకు పనులు నిర్వహించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మాటలే...చేతలేవి? బలుసు జితేంద్ర, గుడ్లవల్లేరు



పెంజెంద్ర నుంచి గుడ్లవల్లేరు ప్రధాన రహదారే కాకుండా మండలంలోని ప్రధాన రోడ్ల పనుల విషయంలో హామీలు అయితే...ప్రభుత్వం ఇస్తోంది. కాని ఆ హామీలను అమలు చేయకుండా ఆదమరుస్తోంది. కూటమి ప్రభుత్వం వస్తే...రోడ్లన్నీ బాగు చేస్తామంటే ఇదేనా?

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నాదెళ్లవారిపాలెం, నడకుదురు 50, 51 బూత్ లో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నేతలు నేతలు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినా సూపర్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానంపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ప్రవేశపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇంచార్జ్ మోర్ల శివ, గ్రామ టిడిపి అధ్యక్షుడు మాతంగి వేణు, పిఎసిఎస్ బ్యాంక్ చైర్మన్ హరినాథ్, పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక –మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందని, తమ ఫిర్యాదులను మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు.

పర్చూరీ గోపాలరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ సిపిఐ ఎంఎల్ పార్టీ సీనియర్ నాయకులు పర్చూరీ గోపాల్ రావు 45వ వర్ధంతిని బందలాయి చెరువు గ్రామంలోని ఆయన స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. గోపాల్ రావు తనయుడు టిడిపి నాయకులు పరుచూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో స్థూపానికి , అదేవిధంగా మాజీ జడ్పిటిసి అడపా రామకోటేశ్వరరావు స్థూపాలకు టిడిపి నాయకులు ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ గోపాలరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడిత ప్రజల కోసం దివిసీమలో కమ్యూనిస్టు రాజకీయాల కోసం ఆయన చేసిన కషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, గ్రామంలోని కమ్యూనిస్టు అభిమానులు పర్చూరీ రామచంద్రరావు, వేకనూరు మాజీ సర్పంచ్ తుంగల సాంబశివరావు, పర్చూ రీ రాఘవ ఆంజనేయులు, సింహాద్రి రత్నారావు, సింహాద్రి దాసు, కొండవీటి కిషోర్,పర్చూరి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు

వైసిపి నాయకుల నివాళి : పర్చూరీ గోపాలరావు 45వ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామంలో ఆయన స్థూపం వద్ద మాజీ జడ్పిటిసి రామకోటేశ్వరరావు స్థూపాల వద్ద వైసిపి నాయకులు, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి గాజుల జయ గోపాల్, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్లు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో వారితో పాటు పర్చూ రి శ్రీనివాసరావు, పర్చూరి పణి పాల్గొన్నారు.





గోపాలరావు రామకోటేశ్వరరావు స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్నటిడిపి, వైసిపి నాయకులు.



చెక్కులు అందజేస్తున్న బాలకృష్ణ

ప్రతిభావంతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-గన్నవరం : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతిలో కష్ణా జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి దుబ్బాకు దుర్గా యశ్వంత్ కు (591) రు. 3000, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి దుబ్బాకు వీర వెంకట నాగేంద్ర కు (589)రు. 2000 ప్రోత్సాహక బహుమతి ఆదివారం అందించారు. వారి తల్లిదండ్రులను సన్మానించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ టి. సీతారాంను అభినందించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి జే సాంబశివరావు, మానవతా చైర్మన్ మడుపల్లి బాలకష్ణమూర్తి కో చైర్మన్ కె ఎస్ జగదీశ్వరరావు కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు పువ్వల ఆదినారాయణ, కార్యదర్శి వి వి కష్ణమోహన్ పాల్గొన్నారు

పిఏసిఎస్‌లకు త్రీమెన్ కమిటీల ఎంపిక

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలో గల 5 పిఏసిఎస్ సొసైటీలకు త్రీ మెన్ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. ఘంటసాల పిఏసిఎస్ చైర్మన్‌గా బండి పరత్సరరావు, పర్సన్లుగా దాసరి సీతారామాంజనేయ ప్రసాద్, రాజులపాటి వీరచారి, కొత్తపల్లి పిఏసిఎస్ చైర్మన్ గా గొర్రెపాటి సురేష్, పర్సన్లుగా మండే రవీంద్ర బాబు, దోనే నాగ మల్లి, కొడాలి పిఏసిఎస్ చైర్మన్ గా గుత్తికొండ గంగాధర సూర్య సత్యనారాయణ వర ప్రసాద్, పర్సన్లుగా కంఠమనేని రాజగోపాల రావు, వేములపల్లి ప్రకాశరావు, శ్రీకాకుళం పిఏసిఎస్ చైర్మన్‌గా తిరుమలశెట్టి రాంబాబు, పర్సన్లుగా గోపు రాఘవ రాజు, డి భీమా రాజు, లంకపల్లి పిఏసిఎస్ చైర్మన్ గా ఎనుముల నాగేశ్వరరావు, పర్సన్లు పరిసే మనీషా, నండూరి సువర్ణ నియమితులయ్యారు.



కొండలమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారికి అంగలూరు గ్రామానికి చెందిన కొలుసు నాగేశ్వరరావు వెండి కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి వెండి 371 గ్రాములు, స్టోన్స్ 60 గ్రాములు, సుమారు 72 వేల రూపాయలు విలువ గల వెండి కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావుకు అందజేశారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు సత్కరించారు. అలాగే శ్రావణమాసం ఆదివారం సందర్భంగా సుమారు 20వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని అత్యధిక స్థాయిలో అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. దర్శనం వచ్చిన యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఈనెల 15వ తేదీ మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారి దేవస్థానంలో మహిళా మణులచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు ముందుగా 516 రూపాయలు చెల్లించి తీసుకొని పేరు నమోదు చేసుకోవాల్సిందిగా ఈఓ కోరారు.

రైతులను ఆదుకుంటాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-పామర్రు : రైతులను అన్ని విధాల ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు.అన్నదాత సుఖీభవ కార్యక్రమం కింద రైతుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేసిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం పామర్రులో రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పలు గ్రామాల మీదుగా స్థానిక మార్కెట్ యార్డ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వందలాదిమంది రైతులు తమ ట్రాక్టర్లతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల అభివద్ధికి ప్రభుత్వం తోడ్పాటున అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కష్ణ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరు పల్లి గణేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శోభన్ బాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పెద్ద రమేష్,వీరంకి వెంకటేశ్వరరావు, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల

కంకిపాడు-గుడివాడకు మధ్య గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు : బాలశౌరి

ప్రజాశక్తి-కంకిపాడు: మండలంలోని ఉప్పులూరు గ్రామంలో కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలసౌరి మాట్లాడుతూ ఉప్పులూరులో 70 లక్షలతో ఒక మంచి కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన చేశామన్నారు. కానూరు, పోరంకి రోడ్డకి 1.70 లక్షలు, మరొకటి 1.30 లక్షల నిధులు మంజూరుతో శంకుస్థాపన చేశామన్నారు. మచిలీపట్నం నుంచి విజయవాడకి ఉన్న ఫోర్ లైన్ రోడ్‌ని సిక్స్ లైన్ చేసే అవకాశం ఉందని చెప్పారు. దానికి సంబంధించి నియోజకవర్గంలో ఎక్కడైతే సిక్స్ లైన్స్ అవుతాయో ఎన్ హెచ్ ఎ వాళ్లతో కలిసి డ్రైనేజీ వ్యవస్థని నమూనాని ప్రజలకు ఉపయోగపడే విధంగా త్వరలోనే నిర్మాణం చేపడతామన్నారు.కంకిపాడు నుండి గుడివాడకు వెళ్లే రోడ్డు రెండు కాలువల మధ్య ఉండడంతో రెండు సంవత్సరాలకు ఒకసారి రోడ్డు కుంగిపోతుందనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి నితిన్ ఘట్కరితో మాట్లాడి కంకిపాడు నుంచి గుడివాడ వెళ్లే రోడ్డుని రైతుల పొలాలలో నుంచి వెళ్లే విధంగా గ్రీన్ ఫీల్డ్ రోడ్‌ను ప్రతిపాదన చేశామన్నారు. కంకిపాడు నుంచి గుడివాడకి సిక్స్ లైన్ రోడ్ కొరకు 600 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు తెలిపారు. మచిలీపట్నం పరిధిలోని నాలుగు నియోజకవర్గాలైన పెనమలూరు, పామర్రు, గన్నవరం, గుడివాడకు ఈ నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ,జనసేన నాయకులు ముప్పా రాజా పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపి బాలశౌరి


ఆర్‌డిఒతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

త్వరలోనే ప్రతి ఇంటికీ కృష్ణాజలాలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ఎ.కొండూరు: కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతున్న కృష్ణా జలాలను తిరువూరు ఆర్డీవో కె.మాధురి ఆదివారం మండలంలోని కేజీ తండాలో ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆర్డీవో మాధురితో మాట్లాడుతూ గత వారం రోజులుగా కృష్ణా జలాలు సరఫరా జరగడంలేదని తెలిపారు. కృష్ణాజలాలు తాగడానికి వీల్లేకుండా పచ్చ రంగులో ఉంటున్నాయని, అందువల్ల నీరు తాగటానికి తమకు భయంగా ఉంటుందని చెప్పారు. నీటి సరఫరా క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జలజీవన్ ప్రాజెక్టు పనులు 90 శాతం వరకు పూర్తి అయ్యాయని, త్వరలోనే ప్రతి ఇంటికి శుద్ధమైన కృష్ణాజలాలను అందించడం జరుగుతుందని చెప్పారు. కృష్ణా జలాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో ఉన్న సింటెక్స్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి బి.గోపికృష్ణ పాల్గొన్నారు.

పైపులైన్ పనులు వేగవంతం చేయాలి : సిపిఎం

మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలను పైపులైన్ ద్వారా అందించేందుకు జరుగుతున్న పైప్‌లైన్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తిరువూరు డివిజన్ అధికారి కె.మాధురిని సిపిఎం నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని కేజీ తండా గ్రామపంచాయతీలో ట్రాక్టర్ల ద్వారా సరఫరా అవుతున్న కృష్ణా జలాలను పరిశీలించడానికి వచ్చిన ఆమెను సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు, నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి కలిశారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న 20 గ్రామాల్లో డిఎంఎఫ్ నిధుల ద్వారా నిర్మించిన 50 సింటెక్స్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింటెక్స్ ట్యాంకులను శుభ్రపరిచే బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులకు కార్యదర్శులకు అప్పగించాలన్నారు సింటెక్స్ ట్యాంకులు శుభ్రపరచకపోవడం వల్ల ట్యాంకులలో నీరు పచ్చ రంగు కు మారడంతో ఆ నీళ్లను గిరిజనులు తాగలేకపోతున్నారని అన్నారు కొన్ని గ్రామాల్లో ఆ ట్యాంకులు పగిలిపోయి ఉన్నాయని వాటిని రిపేర్ చేపించాలని కోరారు.

కామ్యు ఇండస్ట్రీస్ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో నండేపల్లి వర్మచే నూతనంగా నిర్మించిన కామ్యు ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నరసింహారావు పాల్గొన్నారు.

టిడిపి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు విటిపిఎస్ బి కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, తెలుగునాడు విద్యుత్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్వతనేని



సాంబశివరావు, మాజీ వార్డు సభ్యులు మల్లంపూడి శ్రీనివాస్, కిలారి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలు గురించి ప్రజలకు డోర్ టు డోర్ తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డ్ అధ్యక్షులు ఫరహాన్, బొర్రా భాశంకరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం : తాతయ్య



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో వాసవి సేవా సమితి, విజయవాడ ఒమేగా, అను హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక నిర్వాహకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన సాధారణ వైద్య పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు, కంటి పరీక్ష, గుండె పరీక్ష, ఊపిరితిత్తుల, పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. వైద్యులు నిర్వహించే వైద్య పరీక్షల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులను పేరు పేరున పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూకార్డియాలజీ, ఆంకాలజీ, జనరల్ మెడిసిన్ వంటి విభాగాల్లో ఉచిత వైద్య సలహాలు, పరీక్షలు అందించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. డబ్బులు లేక ఏ ఒక్క పేద వాడు మెరుగైన వైద్యానికి దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలు కొన్ని కొన్ని రోగాలకు ఎన్టిఆర్ వైద్య సేవలో ఉన్నప్పటికి వాటిపై సరైన లేని కారణంగా హాస్పటల్లో వైద్యం చేసుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్న ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందచేసి వారిని అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. ప్రేవేటు సంస్థలు, స్వచ్ఛంద సేవాసంస్థలు అందించే ఈ మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఒమేగా అను హాస్పటల్ వారికి ఎమ్మెల్యే ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని, జగ్గయ్యపేటలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఒమేగా హాస్పటల్ మేనేజర్ రుక్మాంగదరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ కంచేటి గీతారాణి, రాయపూడి శ్రీనివాసరావు, తుమ్మేపల్లి నరేంద్రరావు, గెల్ల పూర్ణ చంద్రరావు, సంక వెంకట్రావు, పునుగుపాటి పుల్లయ్య, కాకరపర్తి సోమేశ్వర రావు, పేరూరు నరసింహారావు, పెనుగొండ రామకష్ణ, కంభంపాటి రవి కుమార్, స్వామి కృష్ణ, వాసా నాగమణి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు గాయత్రి అపార్ట్‌మెంట్స్ చాకలి బజార్ మరియు అద్దాల బజార్ ప్రాంతాల్లో 6 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈ పనులు 15వ ఫైనాన్స్ మరియు సీ ఆర్‌డిఎ నిధుల సహాయంతో అమలు కానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ పాత డ్రైనేజీ వ్యవస్థలు ఉన్న ప్రాంతాల్లో కొత్త నిర్మాణం ద్వారా ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతను కాపాడేందుకు కషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ నోముల స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వత్సవాయి: సినీ నటుడు మహేష్ బాబు 50వ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన మహేష్ బాబు అభిమానులు బోనకల్లులోని శాంతి నిలయం ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో దారెల్లి క్రాంతి, మాదుగుల అనిల్, అశోక్,మాదుగుల రామారావు, నాగుల్ మీరా, జగదీశ్, మాగం శివ, పులిపాటి మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

704 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో గత మూడు రోజుల మెగా వైద్య శిబిరంలో మొత్తం 704 మంది వైద్య సేవలు అందించారు. జనరల్ వైద్యం 193 మంది, దంత వైద్యం 102 మంది, కంటి పరీక్షలు 436 మంది పొందారు. ఈ శిబిరంలో వార్డు కౌన్సిలర్లు, ఆయా సచివాలయాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు. సోమవారం పట్టణంలోని విలియంపేట గ్రీన్ సిటీ వద్ద 13, 14 వార్డులలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని జయప్రద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు తెలిపారు.

ముగ్గురు గొలుసు దొంగల అరెస్టు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట, నందిగామలలో వరుస చైన్ స్నాచింగ్ లకు పాల్పడిన ముగ్గురు నిందితులను జగ్గయ్యపేట ఎస్సై రాజు శనివారం అరెస్ట్ చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టణ ఎస్సై రాజు విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ పట్టణంలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు వచ్చిన అతడు దొరక్కపోవడంతో అతని బైక్ ను ఎత్తుకెళ్లిన నిందితులు చైన్ స్నాచింగ్ కు పాల్పడ్డారు. చైన్ స్నాచింగ్ కోసం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఈ విషయం వెల్లడైంది. నిందితులు నుండి నందిగామ, జగ్గయ్యపేటలో చోరీ చేసిన 6.50 లక్షల రూపాయలు విలువైన 82 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నమని తెలిపారు. ఈనెల 1వ తేదీ పట్టణానికి చెందిన గింజుపల్లి కరుణ, పూర్ణచంద్రరావు దంపతులు టీవీఎస్ ఎక్సెల్ పై బంధువుల పరామర్శకు వెళ్లి తిరిగి వస్తుండగా అదే మార్గంలో బైక్ పై వచ్చిన దుండగులు చిల్లకల్లు దాటాక వెనుక నుంచి జగ్గయ్యపేట రోడ్ లో పెట్రోల్ బంక్ వద్ద మెడలో చైన్ తెంపుకొని పరారయ్యారు. బాధితులు పూర్ణచంద్రరావు ఫిర్యాదు పై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఆధారంగా దర్యాప్ ప్రారంభించారు. మంగళగిరి కి చెందిన గొల్ల గోపి గత కొంతకాలంగా జగ్గయ్యపేట పట్టణ శివారు ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గోపికి పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట కు చెందిన వేముల తిరుపతిరావు ఆటో తోలుతుండగా పరిచయమయ్యాడు. చెరువు బజారుకు చెందిన తన బావ శ్రీనును హత్య చేసిన భక్తుల కిషోర్ బాబు పై ప్రతీకారంగా హత్య చేసేందుకు గోపి తన మిత్రులు మంగళగిరి మండలం కొత్తపేటకు చెందిన మచ్చ వెంకటేష్, లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన పఠాన్ సలీంభాషా తో ఒప్పందం కుదురుచుకున్నారు. నెలకితం భక్తుల కిషోర్ బాబు ఇంటికి వెళ్లి రెక్కీ నిర్వహించారు. కిషోర్ లేకపోవడంతో అతని పల్సర్ బైక్ ను ఎత్తుకెళ్లారు. అప్పటినుండి బైక్ పై తిరుగుతూ పథకం వేశారు. పథకం ప్రకారం ముందు నందిగామ తర్వాత జగ్గయ్యపేటలో ఒకేరోజు వరసగా మూడు చైన్ స్నాచింగ్ లకు పాల్పడ్డారు. సీసీ కెమెరాల ఆధారంగా వారు పోలీసులకు దొరికారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ మచ్చ వెంకటేష్ పై చీరాల తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు కేసులు, హత్యకు సఫారీ మాట్లాడిన వేముల తిరుపతిరావు పై పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ లో ఒక కేసు నమోదు అయినట్లు తెలిపారు. భక్తుల తిరుపతిరావు తో స్నేహంతో గోపి కిషోర్ హత్యకు పాత స్నేహితులతో సుపారి మాట్లాడాడు గోపి పరార్ లో ఉండగా మిగిలిన ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టు లో హాజరు పరిచయమని 21 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

మానవతామూర్తి వెంకటకృష్ణారావు

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : గొప్ప మానవతా మూర్తి మండలి వెంకటకృష్ణారావు అని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ కొనియాడారు. శనివారం రాత్రి అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం పురస్కరించుకొని ఎన్వి రమణ దంపతులకు మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విజయలక్ష్మి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలసి మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవం 2025 పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ఎన్వి రమణ మాట్లాడుతూ మండల వెంకటకష్ణారావు నిజమైన గాంధీ అన్నారు. ఆయన అనేక పదవులకు వన్నెతెచ్చారని సమాజ సేవ కోసం అనుక్షణం తపించడమే కాకుండా ఆచరణలో పెట్టిన వ్యక్తి కష్ణారావు అని అన్నారు. వెంకటకష్ణారావు ఎమ్మెల్యేగా, మంత్రి హెూదాలో ఉన్న ఆర్టీసీ బస్సు లోనే ప్రయాణం చేసేవారు అన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షుడు జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కష్ణమోహన్ జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు తా నా మాజీ అధ్యక్షులు కోమటి జయరాం, మాజీ రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఆచంట ఎమ్మెల్యే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పాల్గొన్నారు



ఎన్‌వి రమణ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ దంపతులు, తదితరులు



టిడిపి కండువాలు కప్పుతున్న బోడే ప్రసాద్

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గం కంకిపాడులో వైసీపీకి చెందిన స్థానిక మైనారిటీ నేత షేక్ చిన్ననాజర్ వలి (నన్న) ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతోపాటు, 50 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. ముందుగా కంకిపాడు సెంటర్ నుంచి బైక్‌లపై ర్యాలీగా ఎమ్మెల్యే కార్యాలయం కు చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, పులి శ్రీను పాల్గొన్నారు.




వాగులో పూడిక తీస్తున్న దృశ్యం

వాగులో పూడికతీత

ప్రజాశక్తి-గన్నవరం : గత కొన్ని దశాబ్దాలుగా వాగు పూడిక సమస్య రైతులను ఇబ్బందికి గురిచేస్తుంది. స్థానిక రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు ఈ సమస్యను ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు తెలపగా వెంటనే స్పందించిన ఆయన సమస్యను మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చించి సమస్య పరిష్కరానికి కషి చేశారు. ఈమేరకు అక్కిలేరు వాగు వద్ద పూడికతీత పనులు ప్రారంభించారు. గన్నవరం ఏఎంసి డైరెక్టర్ పాలడుగు మల్లికార్జున రావు, ముస్తాబాద గ్రామ టిడిపి అధ్యక్షులు కడియాల రాజశేఖర్, నీటి సంఘాల అధ్యక్షులు కొమ్మినేని చంద్రశేఖర్ స్థానిక రైతులు పూడికతీత పనులను పర్యవేక్షించారు.

పలువురు మహనీయులకు నివాళి


ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలో పలువురు మహనీయుల విగ్రహాలకు భీమ్జీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పోలా బత్తిన బిపిన్ చంద్రపాల్ నివాళులర్పించారు. ఆదివారం సీతాయలంకలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాజీవ్ సెంటర్లోని వెంకట కష్ణారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా డిఎస్పి రోడ్ మూలలో ఉన్న రాష్ట్ర మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణ రావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రజల అందరికీ హక్కులు కల్పించిన అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందాలని ఆయన ఆశయాలను స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అదేవిధంగా దివిసీమ ఉప్పెన సమయంలో ఎనలేని సేవలందించి గాంధీయవాదిగా కొనసాగి తెలుగు భాషాభివద్ధి కోసం పాటుపడిన మండలి వెంకటకష్ణారావు ఆదర్శనీయుడని కొనియాడారు. నీతి నిజాయితీలకు నిలువుటద్దంగా దేవుడు మంత్రిగా పేరు గడించిన సింహాద్రి సత్యనారాయణ రావు నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. సమాజ హితం కోరి పని చేసిన వారిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బిపిన్ చంద్రపాల్ సూచించారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేస్తున్న చంద్రపాల్


పలు సొసైటీలకు చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలంలో చైర్ పర్సన్‌ల నియామకాలపై ఉత్తర్వులు వెలుపడ్డాయి. మాజీ ఎంపీపీ సోమశేఖర్ ప్రసాద్(లంక బాబు) లక్ష్మీపురం చైర్ పర్సన్‌గా, పర్సన్లుగా తోట రాజేశ్వరరావు సూదాని పూర్ణచంద్రరావు నియమి తులయ్యారు. చల్లపల్లి సొసైటీ చైర్పర్సన్‌గా బొందలపాటి వీరబాబు, పర్సన్లుగా ఆలూరి విశ్రాంతమ్మ,వేమూరి హరికష్ణ, అలాగే మేక వారి పాలెం సొసైటీ చైర్ పర్సన్ గా గుత్తికొండ వంశీకష్ణ పర్సన్లుగా చిటికెనేని శ్రీనివాసరావు, వక్కలగడ్డ శివరామకష్ణ ఎన్నికయ్యారు. అలాగే వక్కలుగడ్డ సొసైటీ చైర్ పర్సన్ గా మల్లుపెద్ది దుర్గా మహేష్(నాని) పర్సన్లుగా బట్టు ప్రసాదరావు, మట్టా రమేష్, అలాగే పురిటిగడ్డ సొసైటీ చైర్ పర్సన్‌గా పెద్ది బోయిన హరినాథ్, పర్సన్లుగా బొల్లా జగన్మోహన్రావు,యార్లగడ్డ రమేష్ బాబు, అలాగే కొత్త మాజేరు సొసైటీ చైర్ పర్సన్ గా తిరుమల శెట్టి బాల నాగేశ్వరరావు పర్సన్లు గా తిరుమలశెట్టి నాగ శేఖర్, యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తి, అలాగే మంగళాపురం చైర్ పర్సన్గా పరుచూరి వెంకటేశ్వరరావు పర్సన్లు గా గొరిపర్తి వెంకటేశ్వరరావు, నిడమానూరి జగన్ మోహన్ రావు లు ఎన్నికయ్యారు.



వంశీకృష్ణకు అభినందనలు : మేకవారి పాలెం సొసైటీ చైర్ పర్సన్‌గా ఎన్నికైన గుత్తికొండ వంశీకృష్ణ, యార్లగడ్డ శ్రీనివాసరావులను డిఆర్ఓ సిసి తూము వెంకటేశ్వ రరావు, విశ్రాంతి ఈఓఆర్‌డి దాసి సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు బుల్లా కిషోర్ లు సన్మానించి అభినందించారు.

ఎంసెట్ సెకండ్ కౌన్సెలింగ్ ఫలితాలు ఎప్పుడు..?



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వంలో ఎంసెట్ రాసి అర్హులై ఇంజినీరింగ్ విద్యలోకి వెళ్లబో తున్న విద్యార్థులకు ఇక్కట్లు తప్పటం లేదు. ఈ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 16,176 సీట్లు ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు 12,227 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన 3,929 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అవి సెకండ్ కౌన్సిలింగ్ ఫలితాలు వచ్చాకే భర్తీ చేసేందుకు ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖ వారు సిద్ధంగా ఉన్నారు. ఈ నెల 3వ తేదీన ఫలితాలు రావలసి ఉన్నాయి. కాని అవి ఇప్పటి వరకు రాకపోవటంతో ఉభయ జిల్లాల్లో బాధిత విద్యార్థులు, తల్లిదండ్రులు కళ్ల కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. నెట్ సెంటర్ల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. ఫస్ట్ కౌన్సిలింగ్ అయ్యాక ఆ సీట్లు దూర ప్రాంతాల్లోని కాలేజీల్లో రావటంతో వారికి దగ్గరగా ఉండే కాలేజీలకు సెకండ్ కౌన్సిలింగ్‌కు కొంతమంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. కానీ ఆ సెకండ్ కౌన్సిలింగ్ ఫలితాల కొరకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఎదురు చూడటమే తప్ప ఫలితాలు మాత్రం రావటం లేదు. అలా ఎన్టీఆర్, కష్ణాజిల్లాల్లో 3,949 మంది విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారు. ఫస్ట్ కౌన్సిలింగ్‌లో పొరబాట్లు జరిగాయని కోర్టులో పిల్ వేసినట్లుగా సంబంధిత శాఖ వారు సైట్‌లో పెట్టారు. తరగతులు మాత్రం ప్రారంభమై రోజులు గడుస్తున్నా...సెకండ్ కౌన్సిలింగ్ ఫలితాలు రాక వేలాది మంది విద్యార్థులు ఆ క్లాసులకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కట్లు అన్నీఇన్నీ కాదు...

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద తమ ప్రతిభతో సీట్లు సాధించిన విద్యార్థులకు సైతం అనేక రకాల ఫీజుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సొమ్మును కాలేజీల యాజమాన్యాలు పిండేస్తున్నారు. ఫస్ట్ కౌన్సిలింగ్‌లో సీట్లు దూర ప్రాంతాలకు వచ్చినా దగ్గరున్న కాలేజీలకు దరఖాస్తు చేసుకున్న వేలాది మంది విద్యార్థులు అవి సెకండ్ కౌన్సిలింగ్‌లో రాక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. సెకండ్ కౌన్సిలింగ్ ఫలితాలు వచ్చేంత వరకు ఒకవేళ దూర ప్రాంతాల్లో వచ్చిన కాలేజీలో చేరాలన్నా... బస్‌ఫీజులు, యూనిఫాం ఫీజులు, బిల్డింగ్ ఫీజుల దరువు తప్పటం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సీట్లు వచ్చినా... ఫలితం లేకుండా కాలేజీల యాజమాన్యాలు రక రకాల ఫీజులతో బాదుతున్నారు. ఒకవేళ ఆ ఫీజులన్నీ అప్పులు చేసి చెల్లించినా... సెకండ్ కౌన్సిలింగ్ ఫలితాలు వచ్చాక వేరే సీటు వస్తే...ఆ సొమ్మంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఆ రక రకాల ఫీజులను వెనక్కి ఇవ్వమన్నా...ఇవ్వకుండా గోడకు కొట్టిన సున్నంలా మారుతుంది. సెకండ్ కౌన్సిలింగ్‌లో ఎంపికైన విద్యార్థులు దూర ప్రాంతాలైనా...ఆ కాలేజీల్లో చేరాలా? వద్దా? అనేది అర్థం గాక తలలు పట్టుకుంటున్నారు. సీట్లు వచ్చిన చోట వెంటనే చేరకపోతే ఆ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా వచ్చిన సీట్లు పోతాయని ఆ కాలేజీ యాజమాన్యాల వారు బెదిరింపులకు కూడా దిగుతున్నారు. దూర ప్రాంతాలైన కాలేజీల్లో చేర్చాలో...వద్దో అర్థం గాక బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. ఇంజినీరింగ్‌కు వచ్చేందుకు ఫస్ట్ కౌన్సిలింగ్‌లో సీట్లు రానటువంటి వేలాది మంది విద్యార్థులు కూడా ఉన్నారు. వారికి సెకండ్ కౌన్సిలింగ్‌లో సీట్లు రాకపోతే ఈ విద్యా సంవత్సరం అంతా పోతుంది. సెకండ్ కౌన్సిలింగ్ కోసం ఎదురు చూసే అలాంటి విద్యార్థులు వేలాది మంది తమ భవిష్యత్తుపై ఆందోళనకు గురవుతున్నారు.

డ్వాక్రా సంఘాలతో మహిళలకు ఆర్థిక చేయూత



ప్రజాశక్తి-పమిడిముక్కల : మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తోందని పమిడిముక్కల మండల వెలుగు ఏపిఎం వెంకటేశ్వర అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 1315 గ్రూపులు ఉన్నాయని, 13,150 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. మంటాడ, లంకపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో సభ్యులు ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్ జనరంజక స్కీం ద్వారా బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తున్నామని ఆయన అన్నారు.

బిసిల అభివృద్ధికి కృషి : కొనకళ్ల

ప్రజాశక్తి-చల్లపల్లి : బీసీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్టిస్ట్ చైర్మన్ కొనకల నారాయణ రావు, అవనిగడ్డ నియోజకవర్గం టిడిపి పరిశీలకులు కనకపర్తి శ్రీనివాసరావులు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ పార్కులో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి బీసీలు, టీబీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. అనంతరం కల్లుగీత కార్మికులు చేనేత కార్మికులు, నాయి బ్రాహ్మణులను సన్మానించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమానికి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని, తాజాగా కూటమీ ప్రభుత్వం మద్యం షాపులు బార్లలో 10 శాతం కేటాయించినట్లు తెలిపారు. చేనేత కార్మికులకు నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, మత్స్యకారులు, బీసీల అభ్యున్నతికి అనేక పథకాల అమలు చేస్తున్నట్లు వివరించారు తొలి నుంచి తెలుగుదేశం పార్టీకి వెన్నంటి నిలిచిన బీసీల అభ్యున్నతికి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేత గోవర్ధన్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి,ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్, నేతలు యార్రగడ్డ శ్రీనివాసరావు, మోర్ల శివ, షేక్ నభి ఘోరి, అగ్గి రాముడు తదితరులు పాల్గొన్నారు



బీసీల జీవితాల్లో వెలుగులు నింపుతాం : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తోడ్పాటు అందించే ఘనత కూటమి ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గీత కులాలకు మద్యం షాపుల్లో 10 శాతం షాపులు కేటాయించడమే కాకుండా లైసెన్సు ఫీజులో కూడా 50 శాతం సబ్సిడీ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో బార్‌లలో కూడా 10 శాతం గీత కులాలకు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గీత కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నంలోని నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత బస్టాండ్ వద్ద నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుండి రుద్రవరం వరకు గీత కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. రుద్రవరంలో తాటి చెట్లకు గీత కార్మికులు పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంఘీభావంగా.. ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కార్మికులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే బీసీల జీవితాల్లో వెలుగులు సాకారమయ్యాయన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా బీసీలు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి వెన్నంటి నిలిచారన్నారు. వారిని అన్ని రకాలుగా ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఎన్నికల హామీ మేరకు మద్యం షాపుల్లో 10 శాతం షాపుల్ని లైసెన్సు ఫీజులో 50శాతం రాయితీతో కేటాయించడం సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. ఈ నిర్ణయంతో రూ.110 కోట్ల వరకు గీత కులాల వారికి మేలు చేశామన్నారు. త్వరలోనే ప్రకటించనున్న బార్ పాలసీలో కూడా గీత కులాల వారికి 10 శాతం బార్లను కేటాయించామని తెలిపారు. గతంలో చెట్టుపై నుండి పడి చనిపోయిన వారికి జీవిత బీమా, గాయాలపాలైన వారికి ఆర్థిక సాయం, దివ్యాంగులైన వారికి పెన్షన్ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కల్లుగీత వత్తిని కాపాడుకునేందుకు అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం అని నీరా పరిశ్రమ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నాం అన్నారు. త్వరలోనే నీరాపై నిర్ణయం తీసుకుంటాం అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపైనా ఉందని, బీసీలందరికీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని మంత్రి కొల్లు రవీంత్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు , పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్మిక హక్కుల సాధనకు ఉద్యమాలు : సిఐటియు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమాలు కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. రెడ్డిగూడెం సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, 44 లేబర్ చట్టాలు రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులపై కత్తి మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పూర్తిగా నిర్వీర్యం చేశారని, స్కీమ్ వర్కర్లపై పని భారం తీవ్ర స్థాయిలో పెరిగిందని, కనీస వేతనం చట్టం అమలు చేసే పరిస్థితి లేదని ఉన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల అధ్యక్షులు కొండపల్లి పరమేశ్వరరావు, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తిరుపతమ్మ, రమేష్, సురేష్, వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెడ్డిగూడెం మండల సిఐటియు కన్వీనర్‌గా ఎం.తిరుపతమ్మ, కో కన్వీనర్ కొండపల్లి పరమేశ్వరరావు, కమిటీ సభ్యులుగా టి నాగరాజు, బి వెంకటరామయ్య, డి సురేష్, వరలక్ష్మి, వాణి, లలిత కుమారి, కుమారి, ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు.





అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో అన్నదాన పథకానికి ఆదివారం నందిగామ పట్నానికి చెందిన రాఘవకృష్ణ 10,116 రూపాయలు ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావ కు అందజేశారు. అలాగే కంకిపాటి నరేష్, బెల్లంకొండ స్వప్న పదివేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై సందర్శకుల రద్దీ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : శ్రావణ మాసం, ఆదివారం సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో దుర్గగుడి కిటకిటలాడింది. ఉదయం నుండే సందర్శకుల రద్దీ పెరగడంతో ఆలయ ఈవో శీనానాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. యాత్రికుల రద్దీ నేపథ్యంలో రూ.500 దర్శనం లైన్లలో సందర్శకులకు అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. సూర్యోపాసన, చండీహోమం, లక్ష కుంకుమార్చన తదితర సేవలలో యాత్రికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన పవిత్రోత్సవాల ముగింపులో భాగంగా దేవస్థాన యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో వికె.శీనానాయక్ దంపతులు, స్థానా చార్య శివ ప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వేద పండితులు పాల్గొన్నారు. దుర్గమ్మను రాష్ట్ర గవర్నర్ సతీమణి సమీరా నజీర్ దర్శించుకున్నారు. ఆమెకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-విస్సన్నపేట: ఉపాధ్యాయ ఉద్యమాల దిక్సూచిగా నిలిచిన యుటిఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ అన్నారు. విస్సన్నపేట యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చంటిబాబు మాట్లాడుతూ యుటిఎఫ్ నిరంతర పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎ.మురళీకృష్ణ, పి.రామకృష్ణారెడ్డి, కే రాజశేఖర్, వి.రవి, ఈ.నాగేశ్వరరావు, సిహెచ్.లక్ష్మయ్య, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతర

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక ధనియాల పేట 8వ వార్డులోని పెద్దవీధిలో ఆదివారం జరిగిన గంగానమ్మ జాతర, పూజల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు కొనసాగిస్తేనే మన గ్రామాలు బాగుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి, జనసేన నాయకులు పెద్దు శ్రీకాంత్, దేవాది నాగేశ్వరరావు, వీర బాబీ, మజ్జి శ్రీనివాసరావు, ఇమ్మిడిశెట్టి భాను, రాజా అజయ్, పడల పూర్ణ, సుంకర వెంకట్, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పరుచూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనంలో మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలు కొండపల్లి క్రాంతి హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు కోరుతుంటే విద్యార్థి సంఘాలను పాఠశాలలోకి, జూనియర్ కళాశాలలోకి అనుమతి లేదంటూ సర్క్యులర్లు తీసుకురావడం దారుణమని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ సంక్షేమ హాస్టలు, విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, జిల్లాలో అనేక సమస్యలతో విద్యార్థులు సతమతం అవుతున్నారని అన్నారు. డిగ్రీ అడ్మిషన్స్ ఆఫ్‌లైన్‌లోనే జరపాలని, ఎన్నికల ముందు నారా లోకేష్ జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారని, నేటి వరకు ఆ హామీ అమలు చేయలేదని అన్నారు. వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్‌ను విడుదల చేయాలని, జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, అధ్యక్షులు జి.గోపినాయక్, ఉపాధ్యక్షులు కుమారస్వామి, కుమార్‌నాయక్, మాధవ్, ప్రణీత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు